నమస్తే తెలంగాణ
నిజామాబాద్, ఆదివారం 1 సెప్టెంబర్ 2024
SUNDAY, SEPTEMBER 1, 2024

సెల్‌టవర్ నిర్మించొద్దని ఆందోళన

ధర్పల్లి, ఆగస్టు 31 : మండల కేంద్రంలోని తిర్మల్ టాకీస్ రోడ్డు కాలనీవాసులు పలువురు శనివారం ఆందోళన చేశారు. తిరుమల్ టాకీస్ రోడ్డుకు సమీపంలో సెల్‌టవర్ నిర్మిస్తున్నారని తెలుసుకున్న కాలనీవాసులు ఘటనాస్థలం వద్ద ఆందోళన చేపట్టారు. సెల్‌టవర్ రేడియేషన్ తరంగాలతో ఇబ్బంది కలుగుతుందని అన్నారు. అనంతరం ఎంపీడీవో బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి సైపుద్దీన్‌ను వివరాలు అడిగి తెలుసుకొని, సెల్‌టవర్ నిర్మించొద్దని నిర్వాహకులను ఎంపీడీవో ఆదేశించారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తంచేశారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

సుభాష్‌నగర్, ఆగస్టు 31 : జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ. 25వేల విలువ చేసే పోటీ పరీక్షల పుస్తకాలను బీఎస్‌రావు హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎస్‌రావు శనివారం వితరణ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, డాక్టర్ కవితా రెడ్డి, రాజ్‌కుమార్ సుబేదార్, దామోదర్‌రావు, నరాల సుధాకర్, డిప్యూటీ లైబ్రేరియన్ రాజరెడ్డి, అసిస్టెంట్ లైబ్రేరియన్ తారకం, రాజేశ్వర్, శ్రీనివాస్, పాఠకులు పాల్గొన్నారు.

పాత్‌లోత్ బికోజీకి డాక్టరేట్

డిచ్‌పల్లి, ఆగస్టు 31 : టీయూ కామర్స్ విభాగ పరిశోధక విద్యార్థి పాత్‌లోత్ బికోజీ.. ప్రొఫెసర్ రాంబాబు గోపిశెట్టి పర్యవేక్షణలో 'కస్టమర్స్ పర్సెప్షన్ టు వర్డ్స్ ఈ బ్యాంకింగ్ సర్వీసెస్, ఏ కంపారిటివ్ స్టడీ ఆఫ్ పబ్లిక్ అండ్ ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్స్' అంశంపై పరిశోధన చేశాడు. టీయూలో శనివారం నిర్వహించిన మౌఖిక పరీక్షకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రవికుమార్ హాజరై ప్రశ్నలు లేవనెత్తారు. పరిశోధక విద్యార్థి ఉదాహరణలతో సమాధానాలు ఇవ్వడంపై సంతృప్తి వ్యక్తం చేసి పీహెచ్‌డీ పట్టా ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు.

కాపర్ తీగల చోరీ : నిందితుడి అరెస్టు

ఎడపల్లి, ఆగస్టు 31: మండలంలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ తీగల చోరీకి పాల్పడిన నిందితుడు ఎరుకల లింగంను శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. తాణాకలాన్ గ్రామ శివారులో పోలీసులు శనివారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నందిపేట్ మండలం కంఠం గ్రామానికి చెందిన ఎరుకల లింగం అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అదుపులోకి తీసుకొని విచారించగా.. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ తీగలను ఎత్తుకెళ్లినట్లు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. నిందితుడు ఎడపల్లి, నందిపేట్, మాక్లూర్, రెంజల్, బోధన్ రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో చోరీలకు పాల్పడి జైలుశిక్ష అనుభవించి విడుదలైనట్లు పేర్కొన్నారు. మళ్లీ యథావిధిగా దొంగతనాలకు పాల్పడుతున్నాడని ఎస్సై తెలిపారు.

4న ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీలు

కంఠేశ్వర్, ఆగస్టు 31 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాయ్స్, గర్ల్స్ ఖోఖో పోటీలను ఈనెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భూమారెడ్డి, అతీఖుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లా పాల్వంచ జడ్పీహెచ్ఎస్ క్రీడామైదానంలో హెచ్ఎం, రాష్ట్ర అవార్డు గ్రహీత గోవర్ధన్‌రెడ్డి సహకారంతో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్ల వివరాలను ఈనెల 2వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు నిజామాబాద్ జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి నాగేశ్వర్‌రావు– 8555996271, 73965 41233, 96762 69988కు ఫోన్ లేదా వాట్సాప్ చేసి తెలుపాలని సూచించారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలి

అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచన

కంఠేశ్వర్, ఆగస్టు 31 : సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా అంకితభావంతో కృషిచేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్ నుంచి వివిధ మండలాల అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో విషజ్వరాలు, డెంగ్యూ ప్రబలకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, రోజువారీగా పీహెచ్‌సీల నుంచి సీజనల్ వ్యాధులకు సంబంధించిన వివరాలు తెప్పించుకొని పరిశీలించాలన్నారు. డెంగ్యూ కేసులు నమోదైతే చుట్టుపక్కల నివాసాల వద్ద నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు.

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

సాంకేతిక కారణాలతోనే రుణమాఫీ కాలేదు

• రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్మారంలో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, ఆగస్టు 31 : సాంకేతిక కారణాలతోనే కొందరు రైతులకు రుణమాఫీ కాలేదని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని నడ్పల్లి, ధర్మారం, బర్ధిపూర్, మెంట్రాజ్‌పల్లిలో అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ధర్మారంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. నడ్పల్లి, ధర్మారం, బర్ధిపూర్‌లో సామాజిక ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలకు పంచాయతీరాజ్ శాఖ 15వ ఫైనాన్స్ నిధులు రూ. 60 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులందరికీ రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్, డిచ్‌పల్లి, ఇందల్వాయి కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, మోత్కురి నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మోపాల్ (ఖలీల్‌వాడి), ఆగస్టు 31 : మండలంలోని బోర్గాం(పీ)లో మనోరమ దవాఖాన ఆధ్వర్యంలో డాక్టర్ కట్టా నర్సింహ సహకారంతో శనివారం ఉచిత మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరై మాట్లాడారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలని సూచించారు.

హనుమాన్ ఆలయం కట్టించిన మేస్త్రి

సిరికొండ, ఆగస్టు 31 : మండల కేంద్రంలోని శ్రీలంక రామలింగేశ్వర స్వామి ఉపఆలయంలో హనుమాన్ విగ్రహానికి సిరికొండ తాపీమేస్త్రి గురువయ్య గుడి నిర్మించారు. తన సొంత ఖర్చులు సుమారు రూ. 2.50 లక్షలతో ఆలయం నిర్మించినట్లు తెలిపారు. ఆలయ పండితుడు నాగరాజు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువయ్య కుటుంబీకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, గంగాధర్, సురేశ్ పాల్గొన్నారు.

ఆలయంలోపూజలు చేస్తున్న గురువయ్య కుటుంబం

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

వినాయక్‌నగర్, ఆగస్టు 31 : జిల్లాకేంద్రంలోని నాగారంలో ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. నాగారం ప్రాంతానికి చెందిన ఖాలేక్ బిన్ అబ్దుల్లా (40) శనివారం ఇంట్లో తెగి ఉన్న విద్యుత్‌వైర్‌కు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. కుటుంబీకులు ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఐదోటౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు.

టీయూలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం దహనం చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.8300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయాలని, మెస్ చార్జీలు పెంచాలని జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. – డిచ్‌పల్లి, ఆగస్టు 31

యువకుడిపై చేయి చేసుకున్న నాయకుడు

వినాయకనగర్, ఆగస్టు 31 : నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడిపై స్థానిక లీడర్ చేయి చేసుకున్నాడని బాధితుడి స్నేహితులు తెలిపారు. గౌతంనగర్‌కు చెందిన సురేశ్ రోడ్డుపై మొబైల్‌లో మాట్లాడుకుంటూ వెళ్తుండగా.. అక్కడ నిలబడి ఉన్న నాయకుడు చరణ్ తాను కనబడడం లేదా అంటూ అకారణంగా చితకబాదాడు. పాతకక్షలను మనస్సులో పెట్టుకొని దాడిచేశాడని బాధితుడు తెలిపారు. ఈ విషయమై మూడోటౌన్ ఎస్సై మహేశ్‌ను వివరణ కోరగా.. ఫిర్యాదు అందలేదని చెప్పారు.

రేషన్‌కార్డు లేని రైతుల వివరాల సేకరణ

పొతంగల్/ సిరికొండ, ఆగస్టు 31 : రేషన్ కార్డు లేక రుణమాఫీ కానీ రైతుల కుటుంబీకుల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు సేకరిస్తున్నారు. పొతంగల్ మండలంలోని హంగర్గాఫారంలో ఏఈవోలు సుప్రియ, శంకర్ రైతు కుటుంబీకుల వివరాలను శనివారం సేకరించారు. సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్‌లో ఏవో నర్సయ్య ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలో వివరాలు వేర్వేరుగా ఉంటే ఈనెల7వ తేదీలోగా సరిచేయించుకోవాలని సూచించారు. ఏఈవోలు కృష్ణారెడ్డి, మోహన్, నిఖిల్, ప్రణతి పాల్గొన్నారు.

సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

ఖలీల్‌వాడి, ఆగస్టు 31 : జిల్లాకేంద్రంలోని విద్యుత్ భవన్‌లో సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా ఎరుకల నారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన వినియోగదారుల సమస్యలను విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక ద్వారా పరిష్కరిస్తామన్నారు. ఆయనను ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం జిల్లా సర్కిల్ ఆధ్వర్యంలో సన్మానించారు. చీఫ్ ఇంజినీర్ రామకృష్ణ, డిచ్‌పల్లి డీఈ ఉత్తం జాడే, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ నాంపల్లి, జిల్లా ప్రధానకార్యదర్శి గంగారాం, నందిపేట్ ఏడీ అశోక్, నాగరాజు, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

చిరంజీవాచార్యులకు సన్మానం

చిరంజీవాచార్యులను సన్మానిస్తున్న కేవీ రమణాచారి

సుభాష్‌నగర్, ఆగస్టు 31 : ప్రముఖ హరికథ కళాకారుడు చిరంజీవాచార్యులను విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి శాలువాతో సన్మానించి అభినందించారు. హైదరాబాద్‌లోని త్యాగరాజ గానసభలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవాచార్యులు శ్రీకృష్ణ రాయభారం హరికథను గానంచేయగా... ఆయనకు ఘనంగా సన్మానించారు.

మోపాల్ మండంలోని మంచిప్ప జడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ప్రేమ్‌లాల్‌ను స్వరాంజలి సంస్థ అధ్యక్షుడు వేముల శేఖర్ శనివారం సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. సామాజిక సేవలు చేస్తున్నందుకు సన్మానించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. –ఖలీల్‌వాడి ఆగస్టు 31

సంక్షిప్తంగా..

■ **చందూర్‌లో భారీ వర్షం** - చందూర్, ఆగస్టు 31 : మండలకేంద్రంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శాంత సూచించారు.

■ **నేడు సంగీత కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం** సుభాష్‌నగర్, ఆగస్టు 31 : వివిధ విభాగాల్లో రాణిస్తున్న కళాకారులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులకు సంగీత కల్చరల్ అకాడమీ నేడు (ఆదివారం) అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు అష్ట గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖలీల్‌వాడీ రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సినీనటి ఎస్తర్ నరోన్హా తదితరులు రానున్నారని, భాషాభిమానులు, కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

■ **విద్యార్థిని ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలి** - ఖలీల్‌వాడి, ఆగస్టు 31 : రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని హాస్టల్‌లో అగ్రికల్చర్ విద్యార్థిని ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని నీలం రాంచంద్రయ్య ఎన్ఆర్ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లాప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేశ్ మాట్లాడుతూ.. సదరు హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్, కళాశాల అధికారులను విచారణ చేపట్టి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నసీర్, సృజన్, శివకుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

■ **వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి** - కోటగిరి, ఆగస్టు 31 : రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ సూచనల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గంగాధర్, ఇన్‌చార్జి ఎంపీడీవో చందర్ శనివారం సూచించారు. పాత ఇండ్లల్లో ఉండవద్దని, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

■ **ముగిసిన ఆక్యుప్రెషర్ వైద్యశిబిరం**- పొతంగల్, ఆగస్టు 31 : మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ –కోటగిరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుడు గంధపురాజు ఆక్యుప్రెషరీ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఏడురోజులుగా కొనసాగిన ఈ శిబిరం శనివారంతో ముగిసింది. సేవలందించిన వైద్యులు, సిబ్బందిని నాయకులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

■ **చందూర్‌లో నేడు ఎడ్ల పొలాల అమావాస్య** - చందూర్, ఆగస్టు 31 : మండలకేంద్రంలో నేడు (ఆదివారం) ఎడ్ల పొలాల పండుగను నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల యజమానులు తమ ఎడ్లను అలంకరించి, సాయంత్రం హనుమాన్ ఆలయంలో నిర్వహించే ప్రదక్షిణ కార్యక్రమానికి తీసుకురావాలని సూచించారు.

■ **రేపు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా** - ఖలీల్‌వాడి, ఆగస్టు 31 : నిత్యావసర ధరలు తగ్గించాలని, ప్రజలకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 2వ తేదీన జిల్లాకేంద్రంలోని ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పేదలందరికీ రేషన్ కార్డులు అందజేసేలా వెసులుబాటు కల్పించాలని, ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా నాయకులు విఠల్‌గౌడ్, అమర్, ఆనంద్ పాల్గొన్నారు.

■ **మాదిగలు రాజకీయాల్లో రాణించాలి**– సిరికొండ, ఆగస్టు 31 : మాదిగలు రాజకీయాలతోపాటు వివిధ రంగాల్లో ఎదగాలని మాదిగ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు నక్క రాజేందర్ అన్నారు. మండలకేంద్రంలో మాదిగల ఐక్యవేదిక కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి విస్తృత సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సంఘ పెద్దలు, మేధావులు, విద్యావంతులు పాల్గొని భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు.

■ **విషజ్వరాలపై అవగాహన సదస్సు** - ఇందల్వాయి, ఆగస్టు 31 : మండలంలోని తిర్మన్‌పల్లి, గన్నారం, దేవీతండాలో విషజ్వరాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. విషజ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్ వివరించారు. ఆయన వెంట ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ఉన్నారు.

■ **చెరువులో పడి ఒకరి మృతి** - మోపాల్ (ఖలీల్‌వాడి),ఆగస్టు 31 : మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లిలో శనివారం బంధువుల పెండ్లికి వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు గ్రామశివారులోని చెరువులో పడి మృతిచెందాడు. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌కు చెందిన మారుతి (32) బంధువుల పెండ్లికి వచ్చాడు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లగా.. చెరువులో జారిపడి మృతిచెందాడు. మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

■ **'చలో విద్యుత్ సౌధ' పోస్టర్ల ఆవిష్కరణ** - ఖలీల్‌వాడి, ఆగస్టు 31 : నగరంలో తెలంగాణ విద్యుత్ ఓసీ, బీసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో చలో విద్యుత్ సౌధ మహాధర్నా పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఖైరతాబాద్‌లో ఈనెల 4న చేపడుతున్న మహాధర్నాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

■ **యూనివర్సిటీలకు వీసీలను నియమించాలి** -డిచ్‌పల్లి, ఆగస్టు 31 : రాష్ట్రంలోని యూనివర్సిటీలతో పాటు టీయూకి వీసీలను వెంటనే నియమించాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. టీయూలో ఆయన శనివారం విలేకరులతో మాటలాడారు. వీసీ లేక టీయూ అభివృద్ధికి నోచుకోవడం లేదని, పరిపాలన గాడి తప్పిందని అన్నారు.

■ **మహాసభలకు తరలిన మహిళలు :** మాక్లూర్, ఆగస్టు 31: హైదరాబాద్‌లో ఈనెల 1,2వ తేదీల్లో పీవోడబ్ల్యూ రాష్ట్ర 7వ మహాసభలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం ఇందిరాపార్కులో శనివారం నిర్వహించిన బహిరంగ సభకు కార్యకర్తలు, మహిళలు తరలివెళ్లారు. మాక్లూర్ నుంచి జిల్లా డివిజన్ ప్రధాన కార్యదర్శి దేశెట్టి రాధ ఆధ్వర్యంలో, సిరికొండ నుంచి పీవోడబ్ల్యూ డివిజన్ కార్యదర్శి పద్మ ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

■ **శాంతి కమిటీ సమావేశం** – ధర్పల్లి/ నందిపేట్, ఆగస్టు 31 : మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘ భవనంలో వినాయక మండపాల నిర్వాహకులతో ఎస్సై రామకృష్ణ శనివారం శాంతికమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. వినాయక నవరాత్రులు, నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలని, మండపాల ఏర్పాటు, విద్యుత్ సరఫరాకు అనుమతులు తీసుకోవాలని సూచించారు. నందిపేట్ మండలంలోని కుద్వాన్‌పూర్‌లో ఎస్సై హరిబాబు సమావేశం నిర్వహించి, మండప నిర్వాహలు పలు సూచనలు చేశారు.

■ **బోధన్ పట్టణాభివృద్ధికి సహకరించాలి :** బోధన్, ఆగస్టు 31: బోధన్ పట్టణ అభివృద్ధికి అధికారులు, కౌన్సిలర్లు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కమిషనర్ వెంకట నారాయణ, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

■ **'వర్డ్'ఆధ్వర్యంలో అవగాహన:** వేల్పూర్, ఆగస్టు 31 : మండలంలోని పచ్చలనడ్కుడ జడ్పీహెచ్ఎస్‌లో వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కౌమారదశ, శారీరక, మానసిక, సామాజిక మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

■ **ఆధార్‌లో తప్పులుంటే బ్యాంకుల్లో సంప్రదించాలి:** ఏర్గట్ల, ఆగస్టు 31 : ఆధార్ కార్డులో తప్పులు ఉండి రుణమాఫీ కాని రైతులు పంట రుణాలు తీసుకున్న బ్యాంకుల్లో సంప్రదించాలని ఏఈవోలు మానస, సాయిసచిన్ సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

■ **కేజీబీవీ తనిఖీ:** ఏర్గట్ల, ఆగస్టు 31 : మండల కేంద్రంలోని కేజీబీవీని తహసీల్దార్ శ్రీలత శనివారం తనిఖీ చేశారు. వాష్‌రూం, తరగతి, వంటగదులతోపాటు రికార్డులను పరిశీలించారు. ఎస్‌వో సుంకారి సంధ్య ఉన్నారు.

■ **డెంగ్యూ వ్యాధి నివారణపై సమీక్ష :** ఎడపల్లి, ఆగస్టు 31 : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో మన్మోహన్ శర్మ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల గ్రామపంచాయతీల కార్యదర్శులతో డెంగ్యూ వ్యాధి నివారణపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ.. మండలంలో పది వరకు డెంగ్యూ కేసులు నమోదైనట్లు తెలిపారు.

■ **గణేశ్ విగ్రహాలను రిజిస్టర్ చేసుకోవాలి:** నవీపేట, ఆగస్టు 31: మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యులు తమ గణపతి విగ్రహాలను పోలీస్ పోర్టల్ లింక్ ద్వారా లేదా నేరుగా రిజిస్టర్ చేసుకోవాలని ఎస్సై వినయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

■ **సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం:** బోధన్ రూరల్, ఆగస్టు 31: సాలూర మండల కేంద్రంలో గ్యాస్ లీకేజీతో సిలిండర్ పేలి ఓ ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన దాము అద్దె ఇంట్లో ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి గ్యాస్ లీకేజీ కావడంతో సిలిండర్ పేలి రేకుల ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

■ **లాడ్జి ఓనర్, కౌన్సిలర్‌పై కేసు నమోదు:** శక్కర్‌నగర్, ఆగస్టు 31: బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్‌లోని స్వాగత్ లాడ్జిలో ఆగస్టు 30న చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో లాడ్జి యజమాని మహ్మద్ మహమూద్, మున్సిపల్ కౌన్సిలర్‌పై సుమోటో కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సంద్ర వీరయ్య శనివారం తెలిపారు. ఇకనుంచి పట్టణంలోని లాడ్జిలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

గుత్పకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

మాక్లూర్, ఆగస్టు 31: మండలంలోని గుత్పకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మాజీ సర్పంచ్ గంట చిన్నయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జాన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గతంలో ఆర్మూర్ డిపో నుంచి బస్సు వచ్చేదని, మళ్లీ పునరుద్ధరించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో చెరుకు ప్రేమ్, వీడీసీ సభ్యులు నర్సయ్య, పోశెట్టి, నజీర్ తదితరులున్నారు.

భీమ్‌గల్‌లో కోర్టు ఏర్పాటు చేయాలని..

భీమ్‌గల్, ఆగస్టు 31 : పట్టణంలో కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కోర్టు ఆర్మూర్‌లో ఉండడంతో ఇక్కడి ప్రాంత ప్రజలు సమయానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అధ్యక్షుడు చెవ్వ అశోక్, ఉపాధ్యక్షులు గంగాదాస్, లింబాద్రి, నర్సయ్య, సత్యనారాయణ, నవీన్, గంగాధర్, రంజిత్, అడ్వకేట్ చైతన్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని..

బోధన్, ఆగస్టు 31: సాలూర మండలం హున్సాలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు వారు డీఈవో దుర్గాప్రసాద్, బోధన్ ఎంఈవో నాగ్‌నాథ్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జడ్పీ, ప్రాథమిక పాఠశాలను విడిగా ఏర్పాటు చేయాలని కోరారు. డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను పంపకపోతే ఎంఈవో కార్యాలయం ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్, ఈరాయప్ప మహరాజ్, శంకర్, శివకుమార్ తదితరులున్నారు.

ఘనంగా అన్నబావు సాఠే జయంతి

బోధన్ రూరల్, ఆగస్టు 31: సాలూర మండలంలోని మందర్న గ్రామంలో శనివారం అన్నబావు సాఠే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు మందుకుల విద్యాసాగర్ హాజరై అన్న బావు సాఠే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వాగ్మారావు, రాము, మారుతి, రాము, హున్సా సొసైటీ చైర్మన్ మందర్న రవి, గంగాధర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మేకల సంతలో వాహనం అపహరణ

నవీపేట,ఆగస్టు 31: నవీపేట సంతలో శనివారం మేకలను కొనుగోలు చేయడానికి వచ్చిన ఓ వ్యాపారికి చెందిన గూడ్స్ వాహనం అపహరణకు గురైనట్లు ఎస్సై వినయ్ తెలిపారు. బోధన్ పట్టణానికి చెందిన ముజాయిత్ అనే వ్యాపారితోపాటు మరో ఐదుగురు (టీఎస్ 16యూఏ 7229) మినీ వ్యాన్‌లో నవీపేట మేకల సంతకు వచ్చారు. రాంపూర్ వెళ్లే రోడ్డుపై వాహనాన్ని నిలిపి సంతలో మేకలు కొనుగోలు చేయడానికి వెళ్లారు. దీనిని గమనించిన ఒక దుండగుడు చోరీ చేసిన మోటర్ సైకిల్ పై వచ్చి మినీ వ్యాన్‌ను తీసుకెళ్లాడు. దీంతో వాహనం యజమాని ముజాయిత్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అయితే దుండగుడు మినీ వ్యాన్‌ను ఎత్తుకెళ్లిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. మహారాష్ట్రకు చెందిన దుండగుడు వాహనాన్ని ఎత్తుకెళ్లినట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, RAJU S/o. LATE SAILU (Old Name) H.No. 11-1-1773, Kanteshwar, Nizamabad. Hence changed my name as ANDHE RAJU H/o. ANDHE VARALAXMI (New name)

ఎంట్రెన్స్ లేకున్నా B.Ed!
★ మేనేజ్‌మెంట్ సీట్...! వాయిదాల్లో తక్కువ ఫీజు. సంప్రదించండి: JN B.Ed కాలేజీ, వేములవాడ. సెల్: 92469 32088.
NTK-0000

ADMISSIONS
★ Seats available in Engineering, Medical & other Courses in Colleges of Hyderabad. Contact: 7799111873, 7799111874.
NT-333107-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్/రెంజల్/ ఎడపల్లి, ఆగస్టు 31: రైతాంగానికి సాగునీరు పూర్తి స్థాయిలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని, కాలువల మరమ్మతులు ఏవైనా ఉంటే వెంటనే చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. శనివారం ఆయన బోధన్ పట్టణంలో నీటి పారుదల శాఖ అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. బోధన్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో వక్ఫ్‌బోర్డుకు చెందిన భూములు కబ్జాలకు గురైనట్లు తనకు సమాచారం అందిందని, కబ్జాలను తొలగిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అంతకు ముందు బోధన్‌లో కొనసాగుతున్న నర్సింగ్ కళాశాల కోసం భవన నిర్మాణానికి అధికారులు, నాయకులతో కలిసి బోధన్– నిజామాబాద్ రహదారి పక్క అంబం గేట్ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆయన పరిశీలించారు. రెంజల్ మండలంలోని నీలా, బోర్గాం, తాడ్‌బిలోలి గ్రామాల్లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పర్యటించారు. అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని, గ్రామస్తులు సహకరించాలని కోరారు. కందకుర్తి తెలుగు మీడియంలో ఉపాధ్యాయుల కొరతపై మండల నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా తక్షణమే స్పందించారు. ఉపాధ్యాయుల నియామకాలపై పొంతలేని సమాధానం ఇవ్వడంతో ఎంఈవో గణేశ్‌రావుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎడపల్లి బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ , సిబ్బంది భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు.

దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలు అందించాలి

శక్కర్‌నగర్, ఆగస్టు 31: ఎన్నికలకు సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని, దివ్యాంగుల సాధికారతకు ప్రత్యేక పథకాన్ని ప్రకటించాలని వికలాంగ జాతీయ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎం. అడవయ్య డిమాండ్ చేశారు. బోధన్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో జాతీయ హక్కుల వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏశాల గంగాధర్ అధ్యక్షతన జిల్లా 3వ మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం దివ్యాంగులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

మోర్తాడ్, ఆగస్టు 31: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పెద్దన్న సూచించారు. కష్టపడి చదివితేనే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతారని పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో స్టూడెంట్ ఫెస్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..కళాశాలలో అన్ని మౌలికవసతులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. జిజ్ఞాస రాష్ట్ర స్థాయి ప్రాజెక్ట్‌కు, పీజీ ఎంట్రెన్స్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

కార్పొరేషన్ రుణాలు అందజేయాలి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 31: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇవ్వాలని డీహెచ్‌పీఎస్ (దళిత హక్కుల పోరాట సమితి) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో జిల్లా అధ్యక్షుడు కమలాపురం రాజన్న మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు రమేశ్ నాయక్, శ్రీను, సాయిలు, మంగ పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాలి

ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 31: బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు సంబంధించిన పేర్లలో మార్పులు, చేర్పులు, సంబంధించిన వివరాలు నమోదు చేసుకోవాలని ఆర్డీవో రాజాగౌడ్ తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సొసైటీల్లో పంట రుణాల చెక్కుల పంపిణీ

మోర్తాడ్/వేల్పూర్/ బాల్కొండ, ఆగస్టు 31: మోర్తాడ్ సొసైటీలో 24 మంది రైతులకు రూ.29,03,500 పంటరుణాల చెక్కులను సొసైటీ చైర్మన్ కల్లెంఅశోక్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ భూమన్న, సొసైటీ ఉపాధ్యక్షుడు దడివె నవీన్, కార్యదర్శి కాశీరాం, సంఘ సభ్యులు పాల్గొన్నారు. వేల్పూర్ మండలంలోని రామన్నపేట్ సొసైటీలో 26 మంది రైతులకు రూ.23,73,500 పంట రుణాల చెక్కులను అందించినట్లు చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రణధీర్, ఉపాధ్యక్షుడు గడ్డం మల్లేశ్, డైరెక్టర్లు పాల్గొన్నారు. బాల్కొండ విండోలో రైతులకు పంట రుణాల చెక్కులను చైర్మన్ నాగులపల్లి సూరజ్‌రెడ్డి పంపిణీ చేశారు. 150 మందికి రూ.కోటీ 40 లక్షలు అందజేసినట్లు ఎన్డీసీసీ బ్యాంకు మేనేజర్ రవి తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను

వెంటనే విడుదల చేయాలి

మోర్తాడ్, ఆగస్టు31: పేద విద్యార్థుల కోసం ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని దళితసంక్షేమసంఘం మోర్తాడ్ మండల అధ్యక్షుడు మల్లూరి రాజారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన ప్రభుత్వ తీరును నిరసిస్తూ మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వపాఠశాలలు, సాంఘికసంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో మౌలికవసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో రమేశ్, జాంభవ, మామిడిగం గాధర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయరహదారిపై గుంతల పూడ్చివేత

మోర్తాడ్, ఆగస్టు 31: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో జాతీయరహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కమ్మర్‌పల్లికి చెందిన సురంగి శేఖర్ తన సొంతఖర్చులతో గుంతలను శనివారం పూడ్చివేయించారు. గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, అధికారులు పట్టించుకోకపోవడంతో గుంతలను పూడ్చివేయించినట్లు శేఖర్ తెలిపారు. శేఖర్‌ను ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో బాలకృష్ణ, రవి, శ్రీనివాస్, నవీన్, శ్యామ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బీరువా, కుర్చీల వితరణ

వేల్పూర్, ఆగస్టు 31 : మండలంలోని మోతె ప్రభుత్వ పాఠశాలకు అక్లూర్ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, వీడీసీ ఉపాధ్యక్షుడు జిన్నా ప్రభాకర్ ఒక బీరువా, పది కుర్చీలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల హెచ్ఎం వైద్య గణేశ్, ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహారావు, ఉపాధ్యాయులు కృష్ణవేణి, గణేశ్, మహేందర్, రత్నయ్య, కవిత, శ్రావణశ్రీ, లలిత పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మోర్తాడ్/ ఏర్గట్ల, ఆగస్టు 31: వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని చౌటపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సుప్రియ సూచించారు. శనివారం మండలంలోని వడ్యాట్ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఆరోగ్యసర్వే నిర్వహించారు. పాలెం గ్రామంలో కమ్మర్‌పల్లి పీహెచ్‌సీ ఆరోగ్యవిస్తరణ అధికారి మారుతి ఆధ్వర్యంలో ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలో వైద్య సిబ్బంది ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా ఏడుగురికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుడు రాజేశ్వర్ సూచించారు.